సాక్షి సూర్యాపేట

బుధవారం । 27 । ఆగస్టు । 2025



పవిత్ర మేడమ్ స్ఫూర్తితో..
పెన్‌పహాడ్ జెడ్పీహెచ్ఎస్ టీచర్ పవిత్ర చదువు చెప్పిన ఎంతో మంది ఆమె స్ఫూర్తితో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు.
- 10లో



విహారం కావొద్దు విషాదం
సాగర్ అందాలను చూసేందుకు వస్తున్న పర్యాటకులు, యువత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.
- 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	585.90 అడుగులు
ఇన్‌ఫ్లో	:	1,61,971 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	1,61,971క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,739 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,387 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	8,807 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు



• వినాయక చవితి సందడి

కోదాడ: వినాయక చవితిని పురస్కరించుకొని మంగళవారం కోదాడ పట్టణంలో పత్రి అమ్మకాలు, (ఇన్‌సెట్‌లో) సిద్ధంగా ఉన్న భారీ లడ్డూలు



కోదాడలో తయారీ కేంద్రం నుంచి మండపాలకు వినాయకులను తరలిస్తున్న భక్తులు

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం. 99489 38922

న్యూస్‌రీల్

కలెక్టర్ వినాయక చవితి శుభాకాంక్షలు

భానుపురి (సూర్యాపేట) : జిల్లా ప్రజలకు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఓ ప్రకటనలో వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. అందరి జీవితాల్లో విఘ్నాలను తొలగించి ఆరోగ్యం, ఐశ్వర్యం ప్రసాదించాలని విగ్నేశ్వరుడుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

గణేష్ నవరాత్రోత్సవాల్లో జాగ్రత్తలు పాటించాలి

సూర్యాపేటటౌన్ : గణేష్ నవరాత్రోత్సవాలతో పాటు విగ్రహాల తరలింపులో జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ నరసింహ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎత్తైన విగ్రహాలు తరలించే క్రమంలో విద్యుత్ తీగల నుంచి అప్రమత్తంగా ఉండాలని కోరారు. విగ్రహం ఎత్తును బట్టి తరలించడానికి మార్గాన్ని ముందుగానే ఎంచుకోవాలని, వాహనాల పై పిల్లలను ఎక్కించవద్దని, పూర్తి కండీషన్ లో ఉండే వాహనాలను ఉపయోగించాలని సూచించారు. అనుభవజ్ఞుడైన డ్రైవర్ ఉండేలా చూసుకోవాలని కోరారు. డీజేలు, బాణసంచా ఉపయోగించవద్దని, రోడ్డు కు ఒక పక్కగా వెళ్లాలని,ఇతర వాహనాలకు, కాలినడక వెళ్లే ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరారు. అందరూ కలిసి మెలిసి ఉత్సవాలను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

నాగారం : నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ పామ్ తోటలను సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ అధికారి తీగల నాగయ్య సూచించారు. మంగళవారం నాగారం మండల కేంద్రంలో గుంటకండ్ల సురేష్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నాలుగేళ్ల నుంచి పంట దిగుబడి ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో తుంగతుర్తి డివిజన్ ఉద్యాన అధికారి ప్రమిత, ఆయిల్‌పామ్ మేనేజర్ హరీష్, ఉద్యాన విస్తరణ అధికారులు ముత్యంరాజు, ప్రభాకర్, ఫీల్డ్ ఆఫీసర్ అశోక్, క్షేత్ర సహాయకుడు సందీప్, రైతులు గుండగాని అంబయ్య గౌడ్, యాదవరెడ్డి, సోమిరెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

చెరువుకు చేప

ఈ ఏడాది 3.41కోట్ల చేప పిల్లలు వదలాలని లక్ష్యం
- టెండర్లు ఆహ్వానించిన అధికారులు
- ఈనెలాఖరుకు ప్రక్రియ పూర్తి
- వచ్చేనెలలో పంపిణీకి సన్నాహాలు





భానుపురి (సూర్యాపేట) : చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ ఏడాది దాదాపు 3,41,18,033 చేపపిల్లలను జిల్లాలోని జలాశయాల్లో వదలాలని నిర్ణయించింది. ఈ మేరకు చేప పిల్లల సరఫరాకు గాను ఏజెన్సీ ఎంపిక కోసం అధికారులు టెండర్లు ఆహ్వానించారు. ఈ ప్రక్రియ నెలాఖరునాటికి పూర్తి కానుంది. ఆ తర్వాత చెరువులు, కుంటల్లో చేప పిల్లలు వదలనున్నారు. అయితే గతంలో టెండర్ల నుంచి పంపిణీ వరకు అన్నీ అక్రమాలే జరిగినట్లు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది టెండర్లు, పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా సాఫీగా జరిగేలా చూడాలని మత్స్యకారులు కోరుతున్నారు.

టెండర్ల దశలో ప్రక్రియ

సూర్యాపేట జిల్లాలో 165 మత్స్య సొసైటీలు ఉన్నాయి. ఇందులో 15,540 మంది సభ్యులు ఉన్నారు. దాదాపు వెయ్యికి పైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గత ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీ పథకాన్ని చేపట్టింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా దీనిని కొనసాగించనుంది. ఈనేపథ్యంలో ఈ సారి 621 చెరువులు, కుంటల్లో చేపపిల్లలను వదలాలని నిర్ణయించింది. ఇందుకోసం ఇటీవల టెండర్లను ఆహ్వానించింది. ఈ ప్రక్రియ ఈనెలాఖరు నాటి వరకు కొనసాగనుంది. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టెండర్లను ఓపెన్ చేయనున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు చేపపిల్లలను సరఫరా చేసే ఏజెన్సీలను ఎంపిక చేస్తారు. ఈ ఎంపికకు క్షేత్రస్థాయి పరిశీలనను సైతం జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీ పరిశీలిస్తుంది.

మూడు రకాలుగా..

జిల్లాలో కాలానుగుణంగా సీజనల్, శాశ్వతంగా నీరు ఉండే చెరువులు కుంటలే కాకుండా జలాశయాలు ఉన్నాయి. వీటిలో ఎంపిక చేసిన చెరువులు, కుంటల్లోనే ఈ ఏడాది చేపపిల్లలను వదలన్నారు. శాశ్వతంగా నీరు ఉండే 188 చెరువులు, కుంటల్లో 80 -100 ఎంఎం సైజ్ ఉన్న చేపపిల్లలు 2,05,51,248 , అదే సైజ్‌లో ఉండేవి రెండు జలాశయాల్లో 37,98,902 చేపపిల్లలను అధికారులు వదలనున్నారు. సీజనల్‌గా నీరు ఉండే జిల్లాలోని 431 చెరువుల్లో 35 నుంచి 40 ఎంఎం సైజ్ గల 97,67,883 చేపపిల్లలను సరఫరా చేసేందుకు ఈ టెండర్లను పిలిచారు.

టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది

జిల్లాలోని మత్స్యకారులకు నాణ్యమైన చేప పిల్లల అందించేలా ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. వచ్చే నెలలో చెరువుల్లోకి చేపపిల్లలను వదలేలా చూస్తాం. చేప పిల్లల పంపిణీతో మత్స్యకారులకు మేలు జరగనుంది.

– నాగులునాయక్, జిల్లా మత్స్యశాఖ అధికారి

బోధన, అభ్యసన మేళాతో విద్యార్థులకు మేలు



బోధన అభ్యసన మేళాలో పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

• కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

చివ్వెంల(సూర్యాపేట) : బోధన, అభ్యసన మేళాతో విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పేర్కొన్నారు. మంగళవారం చివ్వెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండలస్థాయి బోధన అభ్యసన పరికరాల ప్రదర్శనను సందర్శించారు. మండల వ్యాప్తంగా ఉన్న 37 పాఠశాలల ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. బోధన పరికరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మండల స్థాయి ప్రదర్శనలో 1నుంచి 5 వతరగతి వరకు ప్రాథమిక స్థాయి బోధన కోసం తయారు చేసిన పరికరాల్లో ఉత్తమమైనవి ఎంపిక చేసి జిల్లా స్థాయి మేళాకు పంపించనున్నట్లు ఎంఈఓ కళారాణి కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్ కుమార్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ వెల్లడించారు. మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో డీఏఓ శ్రీధర్ రెడ్డి, డీసీఓ పద్మతో కలిసి మండల వ్యవసాయ అధికారులు, మండల విస్తరణ అధికారులు, కోఆపరేటివ్ డివిజనల్ అధికారులతో నిర్వహించిన వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్ ద్వారా యూరియా సరఫరాపై సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 1,600 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రానున్న రెండురోజుల్లో 1,000 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు సరఫరా కానుందని వివరించారు. ఈ నెల వరకు 29,000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటికే 31,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి అవసరాలకు తగ్గట్టుగా నిరంతరం ఈ సీజన్ పూర్తయ్యే వరకు యూరియా సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. యూరియా దొరకదని ఆందోళనతో రైతులు ఎవరు కూడా ముందస్తుగా యూరియా కొనుగోలు చేయకూడదని, జిల్లాలో 5,600 లీటర్ల నానో యూరియా అందుబాటులో ఉందన్నారు.

• పర్యావరణ హితం.. మా అభిమతం



పెన్‌పహాడ్: పర్యావరణ హితమే ధ్యేయంగా పెన్‌పహాడ్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతి ప్రతిమలతో టీచర్ పవిత్ర

విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యం

• ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

తుంగతుర్తి : విద్య వైద్యానికి మొదటి ప్రాధాన్యమిస్తానని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తుంగతుర్తి ఆస్పత్రిలో సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పది సంవత్సరాలలో ప్రభుత్వ ధనాన్ని సరైన రీతిలో ఖర్చుపెట్టక ఆస్పత్రులు ,పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించలేదన్నారు. ఎనిమిది లక్షల కోట్ల రూపాయలు అప్పుచేసి రాష్ట్ర ప్రభుత్వంపై భారం మోపారని నెలకు 8000 కోట్ల రూపాయల వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. తుంగతుర్తిలో నిర్మిస్తున్న ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణం సమస్యలను సంబంధిత మంత్రికి అధికారులకు తెలియజేస్తామన్నారు. ప్రణాళిక ప్రకారం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ వెంకటేశ్వర్లు , ఆస్పత్రి సూపరింటెండెంట్ నిర్మల్ కుమార్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, టీపీసీసీ సభ్యుడు గుడిపాటి నరసయ్య, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ కిషన్ రావు, అనిల్ కాస్త్రో , మల్లేష్ , జోహార్ పాల్గొన్నారు.



తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో వాటర్ ప్లాంట్ ను ప్రారంభిస్తున్న ఎంపీ చామల, ఎమ్మెల్యే సామేల్

సీపీఎస్‌ను రద్దు చేయాలి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల దేవరాజ్ డిమాండ్ చేశారు. వచ్చేనెల 1న సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించే సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఎస్ వల్ల ఉద్యోగులకు భద్రత లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మధు కుమార్, రవీందర్ , చౌదర్ రెడ్డి, రాజశేఖర్, లింగరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల కసరత్తు ముమ్మరం

- తుది ఓటరు జాబితా విడుదలకు నోటిఫికేషన్
- 29న డ్రాఫ్ట్ ఓటర్ లిస్టుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం
- వచ్చే నెల 2న ఫొటో ఓటరు జాబితా ప్రకటన



భానుపురి (సూర్యాపేట) : స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. అందులో భాగంగా మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ క్రమంలో నోటిపై చేయబడిన అన్ని గ్రామ పంచాయతీల్లో ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని జిల్లా పంచాయతీ అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణ కోసం షెడ్యూల్ సైతం విడుదల చేసింది.

జిల్లాలో 6,92,511 మంది ఓటర్లు

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే పంచాయతీ ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. ఈ జాబితా ప్రకారం జిల్లాలోని 486 గ్రామ పంచాయతీల్లో 6,92,511 మంది పంచాయతీ ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,39,857 మంది, మహిళలు 3,52,633 మంది ఉన్నారు. మరో 21 మంది ఇతరులు నమోదయ్యారు. 4388 వార్డులు ఉండగా 4,403 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం

వచ్చేనెల 2 నాటికి తుది జాబితా

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో కీలకమైన ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై తుది జాబితాలు రూపొందించాలని ఎన్నికల సంఘం డీపీఓలను ఆదేశించింది. ఈ మేరకు 28వ తేదీలోపు గ్రామపంచాయతీల్లో డ్రాఫ్ట్ ఓటర్ లిస్టు ప్రకటించాల్సి ఉంది. అలాగే 29న జిల్లాస్థాయిలో ఈ డ్రాఫ్ట్ ఓటర్ లిస్టుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం, 30న మండల స్థాయిలో పార్టీల ప్రతినిధులతో ఎంపీడీఓలు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించింది. ఈ సమావేశాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి వచ్చే అభ్యంతరాలను ఈనెల 31 నాటికి తొలగించి, వచ్చే నెల 2వ తేదీన గ్రామ పంచాయతీల వారీగా ఫొటోతో కూడిన ఓటర్ జాబితాను ప్రకటించనుంది.

యూరియా బారులు




హుజూర్‌నగర్ : యూరియా కోసం పీఏసీఎస్ వద్ద బారులుదీరిన రైతులు

హుజూర్‌నగర్ : వానాకాలం పంటల సాగు ఊపందుకుంది. ఈనేపథ్యంలో యూరియా కోసం రైతులు అరిగోస పడుతున్నారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని పీఏసీఎస్‌కు 220 బస్తాల యూరియాతో లారీ వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న సుమారు 250 మంది రైతులు పీఏసీఎస్ వద్ద బారులుదీరారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున 110 మంది కర్షకులకు పంపిణీ చేశారు. మిగతా వారు యూరియా అందక నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. ఈ విషయమై పీఏసీఎస్ చైర్మన్ జక్కుల నరేందర్ వివరణ కోరగా మంగళవారం ఒకలారీ యూరియా రాగా పంపిణీ చేశామన్నారు. అందని రైతులకు మరోసారి వచ్చినప్పుడు ఇస్తామని చెప్పారు.

ముగిసిన పదోన్నతుల ప్రక్రియ

- జిల్లాలో 24 మంది స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా ప్రమోషన్
- 111 మంది ఎస్‌జీటీలకు ఎస్‌ఏలు, పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతి
- వెంటనే జాయిన్ కావాలని ఆర్డర్లు ఇచ్చిన డీఈఓ



పదోన్నతుల వివరాలు ఇవే..

జీహెచ్‌ఎంలు	24
పీఎస్ హెచ్‌ఎంలు	28
ఎస్‌ఏ(బయోసైన్స్)	17
ఎస్‌ఏ(ఇంగ్లిష్)	13
ఎస్‌ఏ(మ్యాథ్స్)	13
ఎస్‌ఏ(ఫిజికల్ ఎడ్యుకేషన్)	05
ఎస్‌ఏ(ఫిజికల్ సైన్స్)	05
ఎస్‌ఏ(సోషల్)	30

సూర్యాపేటటౌన్ : ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. ఈనెల 21న పదోన్నతుల ప్రక్రియ ప్రారంభంకాగా మొదటగా అర్హులైన స్కూల్ అసిస్టెంట్‌లను జీహెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించారు. ఆ తర్వాత ఎస్‌జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్, పీఎస్ హెచ్‌ఎంలుగా ప్రమోషన్ కల్పించేందుకు ఈ నెల 25న రాత్రి వరకు ప్రక్రియ కొనసాగింది. మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌జీటీల నుంచి ప్రమోషన్లు పొందిన పీఎస్ హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్‌లకు ఆర్డర్లు ఇచ్చారు. వెంటనే ప్రమోషన్ పొందిన పాఠశాలలో జాయిన్ కావాలని ఆదేశాలు జారీ చేశారు.

24 మందికి జీహెచ్‌ఎంలుగా ప్రమోషన్

జిల్లాలో మొత్తం 24 జీహెచ్‌ఎంల పోస్టులు ఖాళీలు ఉన్నట్టు గుర్తించిన జిల్లా విద్యాశాఖ అధికారులు ఆ దిశగా ప్రక్రియ కొనసాగించారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్‌లకు జీహెచ్‌ఎంలుగా ప్రమోషన్లు కల్పించారు. జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు 24 మందికి ప్రమోషన్లు రాగా అందులో నలుగురు ఇతర జిల్లాలకు వెళ్లగా మరో నలుగురు సూర్యాపేట జిల్లాకు వచ్చారు. గెజిటెడ్ హెచ్‌ఎంలుగా గత గురువారం రాత్రి ఉత్తర్వులు అందుకున్నారు. వీరు వెంటనే ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు.

111 మంది పీఎస్ హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి...

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొందిన వారి ఖాళీ స్థానాలు స్కూల్ అసిస్టెంట్ పోస్టులతో పాటు గత కొంత కాలంగా ఖాళీగా ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ)తో భర్తీ చేసేందుకు పదోన్నతుల ప్రక్రియ గత శుక్రవారం ప్రారంభించారు. సీనియారిటీ జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరిచి ప్రక్రియ కొనసాగించారు. ఈ నెల 23న ఎస్‌జీటీల నుంచి వివిధ కేటగిరీలలోని స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హులైన వారి జాబితాను ప్రదర్శించగా, ఈ నెల 24, 25, 26 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్‌లు, పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతులకు కసరత్తు కొనసాగింది. జిల్లాలో మొత్తం 111 మంది ఎస్‌జీటీలకు పీఎస్ హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. వీరు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేశారు.

వెంటనే ప్రమోషన్ పొందిన పాఠశాలలకు వెళ్లాలి



ప్రమోషన్ వచ్చిన ఉపాధ్యాయులు అందరూ వెంటనే పదోన్నతి పొందిన పాఠశాలల్లో జాయిన్ కావాలి. ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలలో వెంటనే రిలీవ్ కావాలి. 15రోజుల్లోపు ప్రమోషన్ పొందిన పాఠశాలకు వెళ్లాలి.

– అశోక్, డీఈఓ

క్లుప్తంగా

వాగులో కొట్టుకుపోయి వ్యక్తి మృతి


బాలరాజు (ఫైల్)

గుండాల: వాగులో కొట్టుకుపోయి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గుండాల మండలం అంబాల గ్రామ శివారులో మంగళవారం జరిగింది. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం రామచంద్రగూడేనికి చెందిన చిర్ర బాలరాజు(55) హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్‌లో ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడి భార్య గతంలోనే మృతిచెందింది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. బాలరాజు తన అత్తగారి ఊరైన ఆత్మకూరు(ఎం) మండలం పారుపల్లి గ్రామంలో మైసమ్మ పండుగకు హాజరయ్యేందుకు ఆదివారం హైదరాబాద్ నుంచి బస్సులో బయల్దేరి మోత్కూరులో దిగాడు. అక్కడి నుంచి పారుపల్లి గ్రామంలోని తన అత్తగారి వ్యవసాయ బావి వద్దకు వెళ్లేందుకు ఆత్మకూరు(ఎం) మండలం మోదుబావిగూడెం, గుండాల మండలం అంబాల గ్రామ శివారులోని బిక్కేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యాంపై నడుచుకుంటూ వెళ్తుండగా.. వాగులో జారిపడి కొట్టుకుపోయాడు. మంగళవారం అంబాల గ్రామ శివారులో బిక్కేరు వాగు ఒడ్డున బాలరాజు మృతదేహాన్ని స్థానిక రైతులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తేజమ్‌రెడ్డి తెలిపారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

నాగారం: కుక్కల దాడిలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ ఘటన నాగారం మండలం ఫణిగిరి గ్రామంలో మంగళవారం జరిగింది. ఫణిగిరి గ్రామానికి చెందిన షేక్ షఫీ స్థానిక మేరీ మదర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో అటెండర్‌గా, తుంగతుర్తికి చెందిన జటంగి సతీష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మంగళవారం షఫీ పాఠశాల వెనుక గదిలోకి వెళ్లగా.. అక్కడ కుక్కలు ఉండడంతో వాటిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నించాడు. దీంతో కుక్కలు అతడిపై దాడి చేశాయి. అతడు కేకలు వేయగా సమీపంలో ఉన్న ఉపాధ్యాయుడు సతీష్ వచ్చి షఫీని విడిపించే ప్రయత్నం చేయగా.. అతడిపై కూడా కుక్కలు దాడి చేసి ఛాతి భాగంలో గాయపరిచాయి.

విహారం కావొద్దు విషాదం

- సాగర్ సందర్శనకు వచ్చేవారు అప్రమత్తంగా ఉండాలని సూచన
- జలాశయంలోకి దిగొద్దని హెచ్చరిక
- సూచిక బోర్డులు, ట్రంచ్‌ల ఏర్పాటు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతుండడంతో సాగర్ అందాలను చూసేందుకు పర్యాటకులు, యువత భారీగా తరలివస్తున్నారు. ఈ క్రమంలో కొందరు సాగర్ పరిసర ప్రాంతాల్లో, దయ్యాలగండి పుష్కర ఘాట్ వద్ద జలాశయంలోకి దిగడం వంటివి చేస్తున్నారు. అదేవిధంగా సెల్ఫీలు, ఫొటోలు తీసుకునే క్రమంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఒక్కసారిగా కాలు జారి నీటిలో పడితే బయటకు రావడం కష్టమని రక్షణ సిబ్బంది చెబుతున్నారు. గతంలో పలువురు యువకులు నీటిలో ఈత కొడుతూ, ఫొటోలు దిగుతూ ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఇటీవల సోషల్ మీడియాలో షార్ట్ వీడియోలు, సెల్ఫీలు ట్రెండ్ అవుతున్న నేపథ్యంలో యువత జలాశయం నీటిలో దూకుతూ, లోతైన ప్రదేశాల్లో ఈత కొడుతూ వీడియోలు తీసుకుని వాటిని సోషల్ మీడియాలో పెట్టడం ఫ్యాషన్‌గా మారింది. అనుకోని ఘటన జరిగితే ప్రాణాలనే ప్రమాదమని గుర్తించాలని స్థానికులు, అధికారులు సూచిస్తున్నారు.


సాగర్ జలాశయ తీరంలో యువత


దయ్యాలగండి పుష్కరఘాట్ వద్ద పర్యాటకులు

అధికారుల ఏర్పాట్లు..

పర్యాటకుల భద్రత కోసం సాగర్ తీరం వెంట అధికారులు, పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దయ్యాలగండి వద్ద గల పుష్కర ఘాట్ వద్దకు వెళ్లకుండా రోడ్డు వెంట లోతైన ట్రంచ్ కొట్టారు. కొన్ని చోట్ల పోలీసులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేస్తున్నారు. అయినప్పటికీ కొందరు ఆ సూచనలను పట్టించుకోవడం లేదని అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీకి యత్నం

మునుగోడు: మునుగోడు మండలం చొల్లేడు గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడెంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మద్ది మల్లేష్ సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి వ్యవసాయ పనులకు వెళ్లగా.. మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి చోరీకి యత్నించారు. కానీ ఇంట్లోకి వెళ్లకుండానే తిరిగి వెళ్లిపోయారు. మల్లేష్ కుటుంబ సభ్యులు ఇంటి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు మల్లేష్ తెలిపాడు.

బ్యాంకులో లోన్ చెల్లిస్తున్న వ్యక్తి నుంచి నగదు చోరీ

నకిరేకల్: బ్యాంకులో గోల్డ్ లోన్ చెల్లించేందుకు వచ్చిన వ్యక్తి నుంచి గుర్తుతెలియని మహిళలు డబ్బులు చోరీ చేశారు. ఈ ఘటన నకిరేకల్‌లోని సహకార కోపరేటివ్ బ్యాంక్‌లో సోమవారం మధ్యాహ్నం జరిగింది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం నడిగూడెం గ్రామానికి చెందిన నాగరాజు నకిరేకల్‌లోని కోపరేటివ్ సహకార బ్యాంక్‌లో గోల్డ్ లోన్ తీసుకున్నాడు. లోన్ చెల్లించేందుకు సోమవారం మధ్యాహ్నం బ్యాంక్‌కు వచ్చాడు. రూ.3లక్షలు బ్యాంకు కౌంటర్‌లో చెల్లిస్తుండగా గుర్తుతెలియని మహిళలు అతని చుట్టూ చేరారు. ఈ క్రమంలో నాగరాజుకు ఫోన్ రావడంతో పక్కకు జరిగి ఫోన్ మాట్లాడుతున్నాడు. ఇది గమనించిన నలుగురు మహిళలు కౌంటర్ దగ్గర నాగరాజుకు చెందిన రూ2.50లక్షల అపహరించి పరారయ్యారు. బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు

కోదాడ: కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పకొట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. ఈశ్వరరావు కోరారు. మంగళవారం కోదాడలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చిందని, వీటి వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు అమ్ముతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా కార్మికులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 29న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ముందు జరిగే ధర్నాలను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, రాధాకృష్ణ, శ్రీలం శ్రీను, చెరుకు ఏకలక్ష్మి, సోమయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈశ్వరరావు

బొలేరో వాహనం ఢీకొని బాలిక మృతి


అక్షర (ఫైల్)

కొండమల్లేపల్లి: బొలేరో వాహనం ఢీకొని బాలిక మృతి చెందింది. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతల్‌పహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాపూజీనగర్ వద్ద మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్‌ముంతలపహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాపూజీనగర్‌కి చెందిన పీట్ల రాజు, సంధ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. రాజు కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వినాయక చవితి పండుగ సందర్భంగా సోమవారం బాపూజీనగర్‌కు వచ్చారు. మంగళవారం ఉదయం రాజు కుమార్తె అక్షర(4) తన నానయమ్మ సుగుణమ్మతో కలిసి బాపూజీనగర్‌లో రోడ్డు దాటుతుండగా.. దేవరకొండ నుంచి కొండమల్లేపల్లి వైపు వేగంగా వస్తున్న బొలేరో వాహనం అక్షరను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అక్షరను దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

మట్టపల్లిలో గరుడ వాహన సేవ


గరుడ వాహనంపై ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాయలంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని సోమవారం అర్చకులు విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం శ్రీసామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూ వరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం , పంచగవ్య ప్రాశన, మధుపర్క పూజ , మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గరుడ వాహనంపై స్వామి అమ్మవార్లను ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కాగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయ స్వామికి నాగవల్లి దళాలతో ప్రత్యేక అర్చనలు చేశారు. ఆ తర్వాత మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, అంజనేయా చార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, కంబాల మురళినాయుడు పాల్గొన్నారు.

మేకలు అపహరిస్తున్న ముఠా అరెస్ట్

- రూ.2.46లక్షల నగదు, 22 గొర్రెలు, 8 కార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ: రాత్రి వేళ కార్లలో మేకలు అపహరిస్తున్న 16 మంది ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం రాత్రి శాలిగౌరారం సమీపంలోని బైరవోని బండ ఎక్స్ రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. అటుగా కారులో వచ్చిన వారు తప్పించుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు కారును వెంబడించి పట్టుకున్నారు. కారులో అనుముల మండలం అలీనగర్‌కు చెందిన సంపంగి వెంకటేష్, సంపంగి శారద, మునుగోడు మండలం గూడపూర్‌కు చెందిన వేంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నిడమనూరుకు చెందిన దాసర్ల వినోద్‌కుమార్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారి ఫింగర్ ప్రింట్స్ స్కాన్ చేయగా వారిపై గతంలో మేకలు చోరీ చేసిన కేసు ఉన్నట్లు తేలింది. పట్టుబడిన నలుగురిని విచారించి.. వారితో పాటు మేకలు చోరీ చేస్తున్న మర్రిగూడ మండలం శివన్నగూడేనికి చెందిన వరికుప్పల రవి, రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన గండికోట శివకుమార్, ఏపీలోని పల్నాడు జిల్లా గురజాల మండలం ఎస్సీ కాలనీకి చెందిన అమ్ములూరి విజయ్, హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన లింగాల అశోక్, ఉండం కళ్యాణి, భువనగిరి హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన వల్లెపు ప్రసాద్, మహబూబ్‌నగర్ జిల్లా బాలనగర్ మండలం పెద్దాయిపల్లికి చెందిన మద్యాల సహదేవ్, సూర్యాపేట జిల్లా మోతెకు చెందిన కోడిసె వంశీకృష్ణ, కంపాటి హుస్సేన్, కంపాటి అజయ్‌కుమార్, మట్టి సురేష్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. వీరంతా కలిసి నాలుగు ముఠాలుగా ఏర్పడి కార్లలో పగటిపూట రెక్కీ నిర్వహించి రాత్రి వేళ మేకలను కార్లలో వేసుకొని చోరీలకు పాల్పడుతున్నారని ఎస్పీ తెలిపారు. వీరు నల్లగొండ జిల్లాలో 15 చోట్ల, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్, నాగర్‌ర్నూల్ జిల్లాల పరిధిలో 10 చోట్ల మేకలు అపహరించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. దొంగలించిన మేకలను సంతలలో గుర్తుతెలియని వ్యక్తులకు అమ్మి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారని ఎస్పీ వివరించారు. వారి నుంచి రూ.2.46లక్షల నగదు, 22 గొర్రెలు, 8 కార్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముఠాలోని కోటేష్, కనుకుల బేబీ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో నిందితులను పట్టుకున్న నల్లగొండ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్‌రెడ్డి, ఎం. నాగభూషణ్, కె. కొండల్‌రెడ్డి, శాలిగౌరారం ఎస్‌ఐ, నార్కట్‌పల్లి సీఐ, పోలీస్ సిబ్బంది, సీసీఎస్ సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి రివార్డు ప్రకటించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, పోలీస్ అధికారులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తాం


కల్నల్ లక్ష్మారెడ్డితో ఎంజీయూ విద్యార్థులు

నల్లగొండ టూటౌన్: ఎన్‌సీసీ శిక్షణ తరగతుల్లో క్రమశిక్షణ, దేశభక్తి సమ్మిళితమైన ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తామని కల్నల్ లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో ప్రవేశానికి 60 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వారిలో ఎత్తు, బరువు, ఆరోగ్యం, రాత పరీక్షల ఆధారంగా ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేస్తామని తెలిపారు. ఇంజనీరింగ్ విద్య అభ్యసించే విద్యార్థులకు ఎన్‌సీసీ ద్వారా నేషనల్ డిఫెన్స్ అకాడమీ, అగ్నివీర్ లాంటి పథకాల్లో అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఇన్‌చార్జి డాక్టర్ మత్స్యేందర్, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్.సుధారాణి, కొమ్ము మల్లయ్య, చంద్రవీర్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్


నిందితులను చూపుతున్న ఎస్‌ఐ

మోతె: మోతె మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకుల నుంచి 1.200 కేజీ గంజాయిని మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండల కేంద్రానికి చెందిన యువకుడు, తన స్నేహితులతో కలిసి భద్రాచలం, ఒరిస్సా ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసి మోతె మండలానికి తీసుకొస్తుండగా.. ముందస్తు సమాచారం మేరకు ఎస్‌ఐ అజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని రత్నాలకుంట ఇద్దరిని పట్టుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన నిందితుల నుంచి 1.200 కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

చివ్వెంల(సూర్యాపేట): కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాది శ్రీకాంత్‌పై కొందరు దుండగులు దాడి చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని ఏర్పాటు చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పవిత్ర మేడమ్ స్ఫూర్తితో..


విద్యార్థులకు కార్డ్ గేమ్స్, బోర్డు గేమ్స్ గురించి వివరిస్తున్న ఉపాధ్యాయురాలు పవిత్ర


డిజిటల్ పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు పవిత్ర

- టీచర్లు, లెక్చరర్లుగా పలువురి ఎంపిక
- జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లలో పాల్గొని సత్తాచాటుతున్న విద్యార్థులు

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మారం పవిత్ర జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు ఎంపికయ్యారు. మారం పవిత్ర స్ఫూర్తితో ఆమె చదువు చెప్పిన ఎంతో మంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఆమె కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా.. తమలోని భయాలను తొలగించించేందుకు కృషిచేసేదని, చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు వారిలోని ఇతర ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేదని విద్యార్థులు చెబుతున్నారు.

జిల్లాస్థాయిలో గుర్తింపు లభించింది



పవిత్ర గైడెన్స్‌లో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో వీడర్ అండ్ సీడర్ ప్రాజెక్టు ప్రదర్శించడంతో జిల్లా స్థాయిలో గుర్తింపు వచ్చింది. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం సంతోషంగా ఉంది.

– బి. శ్రీకాంత్, 10వ తరగతి, పెన్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్

సంతోషంగా ఉంది



ఆంధ్ర, తెలంగాణ అగస్త్య జిజ్ఞాస పోటీల్లో మొదటి బహుమతి రావడం సంతోషంగా ఉంది. ఈ అవార్డుతో పాటు రూ.1500 ప్రైజ్‌మనీ పొందాను. జీవశాస్త్ర టీచర్ పవిత్ర మేడమ్ నన్ను ఎంతగానో ప్రోత్సహించింది.

– ఎం. మేఘన 10వ తరగతి, పెన్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్

జిల్లా సైన్స్ ఫెయిర్‌లో అవార్డు దక్కింది



నేను తయారు చేసిన క్రాప్ ప్రొటెక్టర్ ఆఫ్ అన్‌సీజనల్ రెయిన్స్ ప్రాజెక్టుకు జిల్లా సైన్స్‌ఫెయిర్‌లో అవార్డు దక్కడం ఆనందంగా ఉంది.

– శ్వేత 10వ తరగతి, పెన్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్

బోధన తీరుతో స్ఫూర్తి పొందా..



సూర్యాపేటలోని ఎంఎస్‌ఆర్ బీఈడీ కళాశాలలో చదువుతున్నప్పుడు పవిత్ర మేడమ్ ప్రైవేట్ లెక్చరర్‌గా మాకు పాఠాలు బోధించేది. ఆమె బోధనా తీరు, ప్రేరణతో జీవితంలో ఉన్నతస్థాయికి చేరాలనే లక్ష్యంతో కష్టపడి చదివి ఉద్యోగం టీచర్ ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం చందూరు మండలం దానుపాముల జెడ్పీహెచ్‌ఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను.

– రానమల్ల సికిందర్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, దానుపాముల, చందూరు

స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యా..



నేను గరిడేపల్లి మండలం గడ్డిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదువుతున్నాను. పవిత్ర టీచర్ ఇచ్చిన శిక్షణతోనే నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాను. ప్రస్తుతం ప్రతి సంవత్సరం అకౌంట్‌లో రూ.12వేలు జమవుతున్నాయి. విద్యాభ్యాసం కోసం స్కాలర్‌షిప్ ఎంతగానో దోహదపడుతుంది.

– ఎ. వైష్ణవి, 10వ తరగతి, గడ్డిపల్లి జెడ్పీహెచ్‌ఎస్

ప్రాక్టికల్ విధానంలో బోధన చూసి..



మద్దిరాల మండలం గోరంట్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉన్నప్పుడు పవిత్ర టీచర్ ప్రాక్టికల్ విధానంలో సైన్స్ బోధించడం చూసి.. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ఇస్రోలో టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం హైదరాబాద్‌లోని కులీ కుతుబ్‌షా పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. విద్యార్థులతో ఎలా ఉండాలనే విషయాన్ని పవిత్ర టీచర్ నుంచే నేర్చుకున్నాను.

– ప్రవీణ్‌కుమార్, పాలిటెక్నికల్ లెక్చరర్